## ఓటర్ లిస్టులో తప్పులు లేకుండా చూసుకోవాలి




పూడూరు, జూన్ 24: ప్రతి గ్రామంలో బీఎల్వోలు ఓటర్ లిస్టులో తప్పులు లేకుండా చూసుకోవాలని తహసీల్దార్ భరత్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. పూడూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల విజన్ పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ లిస్టులో 18 సంవత్సరాలు నిండిన నూతన అభ్యర్థులను నమోదు చేసుకుంటూ, మృతిచెందిన వారి జాబితాలో నుండి తొలగించాలని సూచించారు. ఓటర్ లిస్టులో అభ్యర్థుల ఇంటి నెంబర్ వార్డు నెంబర్ సరిగ్గా ఉండేలా చూడాలని వివరించారు. మండల పరిధిలోని బూత్ లెవెల్ ఆఫీసర్లు 52 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పాండు, డీప్తి తహసిల్దార్ వెంకటాచారి ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన

దోమ, జూన్ 24 : దీర్ఘకాలంగా ఇబ్బందులకు గురి చేసే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా టీబీ అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్, దోమ మండల వైద్యాధికారి రజిత అన్నారు. టీబీ ముక్త అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలో దిర్సంపల్లి సబ్ సెంటర్ పరిధిలో ఉన్న బడంపల్లి కొండయపల్లి, దిర్సంపల్లి తండా తదితర గ్రామాల్లో ప్రజలకు క్షయవ్యాధి, రక్తపోటు, హెచ్ఐవీ, మధుమేహం వ్యాధుల పట్ల వైద్య అధికారులు అవగాహన కల్పించారు. సదస్సుకు హాజరైన వారిలో 20 మందికి టీబీ టెస్ట్ లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 15 రోజుల పైబడి దగ్గు ఉన్న వారందరూ తప్పనిసరిగా తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ నిర్ధారమైన ప్రతి పేషెంట్ కు ప్రతినెల వారి ఖాతాలో పౌష్టికాహారం కోసం వెయ్యి రూపాయలు జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో విజయలక్ష్మి హెచ్ఈవో ప్రభులింగం టీబీ హెల్త్ విజిటర్ రాజూ నాయక్, ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ రక్షణ కిట్ల పంపిణీ

రోగులకు కిట్లను పంపిణీ చేస్తున్న కుష్టు ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్

వికారాబాద్, జూన్ 24 : వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ ఆదేశానుసారం జిల్లా కుష్టు నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం కుష్టు రోగులకు అంగవైకల్య నియంత్రణ, రిహాబిలిటేషన్ కార్యక్రమంలో భాగంగా స్వీయ రక్షణ కిట్లను 30 మందికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కిట్ లో ఒక టబ్బు, బకెట్, మగ్, బ్యాండేజ్ లు, యాంటీబయాటిక్‌లు, ఆయింట్మెంట్‌లు, పండ్లు, బిస్కెట్లు ఉన్నాయన్నారు. కుష్టు రోగులకు వారికి కలిగే అంగవైకల్యాన్ని తగ్గించడం కోసం, వారే స్వయంగా గాయాలకు కట్లు కట్టుకునే విధంగా ప్రోత్సహించడం కోసం ఈ స్వీయ రక్షణ కిట్లను అందించడం జరిగిందన్నారు. కుష్టు రోగులు వారికి అయిన గాయాలను తరచుగా శుభ్రం చేసుకుని, మందులను, ఆయింట్మెంట్లను వాడి బ్యాండేజ్ లతో కట్టుకోవడం ద్వారా వారి గాయాలు తొందరగా తక్కువ అవ్వడమేకాక మరింత పెద్దవి కాకుండా అంగవైకల్యం రాకుండా నిరోధించిన వాళ్లం అవు తాం అని కుష్టు ప్రోగ్రాం అధికారి రవీంద్ర యాదవ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎమ్‌వో లు నరసింహారెడ్డి, హరిత, విజయభాస్కర్ , డాక్టర్ నిఖిల్ , డాక్టర్ రోహిత్ పాల్గొన్నారు.

దోమ, జూన్ 24: హరితహారం కార్యక్రమ నిర్వహణ నాటికి నర్సరీలలోని మొక్కలు సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవో గ్యామ్య నాయక్ అన్నారు. మండల పరిధిలోని పెద్దతండా, చిన్న తండా గ్రామపంచాయతీలలోని నర్సరీలను పంచాయతీ కార్యదర్శి తిరుపతితో కలిసి మంగళవారం ఎంపీడీవో పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, ఇందిరమ్మ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## 1,130 సెల్‌ఫోన్లు రికవరీ

సిటీబ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ఇటీవల మొబైల్ ఫోన్లు చోరీకి గురికావడం, మిస్సింగ్ కావడం ఎక్కువగా జరుగుతుందని, సెల్‌ఫోన్ యజమానులు జాగ్రత్తగా ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు సూచించారు. రాచకొండ పరిధిలో చోరీ, మిస్సింగ్‌కు గురైన 1,130 ఫోన్లను రికవరీ చేసి, ఆయా ఫోన్‌ల యజమానులకు అప్పగించారు. ఈ సందర్భంగా మంగళవారం నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ.. సెంట్రల్ ఇక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ(సీఈఐఆర్) ద్వారా పోయిన ఫోన్లను గుర్తించి, వాటిని రికవరీ చేసినట్లు తెలిపారు. ఎల్బీనగర్, మల్కాజిగిరి, భువనగిరి సీసీఎస్ పోలీసులు ఐటీ సెల్ సహకారంతో ఈ ఫోన్లను రికవరీ చేసినట్లు సీపీ తెలిపారు. రెండు నెలల వ్యవధిలో రూ.3.5 కోట్ల విలువైన 1130 మొబైల్ ఫోన్లను ప్రత్యేక బృందాలు రికవరీ చేశాయన్నారు. ఆయా సెల్‌ఫోన్ల యజమానులకు సీపీ ఫోన్లను అప్పగించి.. రాచకొండ పోలీసుల పనితీరుపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. ఈ సందర్భంగా పోయిన ఫోన్లు తమ చేతికి అందడంతో సెల్‌ఫోన్ యజమానులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో క్రైమ్స్ డీసీపీ వి.అరవింద్‌బాబు, ఏసీపీ కరుణసాగర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో సర్కార్ దవాఖాన

- సరిపడు వైద్యులు, సిబ్బంది కరువు
- పరికరాలు, అంబులెన్స్‌లు అంతంత మాత్రమే
- ప్రారంభోత్సవంలో అన్నీ సమకూరుస్తామని హామీ
- ఇప్పటికైనా స్పందించాలని స్థానికుల వినతి

వికారాబాద్ ప్రభుత్వ జనరల్ దవాఖాన

వికారాబాద్, జూన్ 24 : జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.30కోట్లతో 300 పడకల దవాఖానను ఏర్పాటు చేసి అన్ని పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న తరుణంలో ఎన్నికల ప్రక్రియ మొదలైంది. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మే 12న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ప్రారంభ సమయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి 45 రోజుల్లో దవాఖానకు సరుపడు పరికరాలు, మిషన్లు అందిస్తామని హామి ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆపరేషన్‌లకు సరిపడు మిషన్‌లు అందుబాటులో లేక పోవడంతో రోగులు పలు ఇబ్బందులు పడుతున్నారు. దవాఖానకు సరిపడు పరికరాలు అందించాలని ప్రభుత్వానికి వైద్య అధికారులు ప్రతిపాదనలు పంపినా ప్రయోజనం శూన్యం. దవాఖానకు వైద్యులు, సిబ్బంది మొత్తం కలిపి దాదాపు 280 మంది కావాల్సి ఉండగా.. 120 పోస్టులు ఖాళీ ఉన్నాయి. ల్యాబ్ టెక్నీషియన్ దాదాపు 29 ఉండగా.. 29 ఖాళీ ఉన్నాయి. ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్‌లు రావాల్సి ఉంది. బ్లెడ్ బ్యాంక్ స్టోర్‌కు గ్రేజర్స్ రావాల్సి ఉన్నాయి. ఈసీజీ టెక్నిషయన్లు లేరు. ప్లంబర్, ఎలక్ట్రిషన్ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పరికరాలు, ఆపరేషన్‌కు సంబందించిన మిషన్లు అందించాలని వైద్య అధికారులు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించిన దవాఖానకు అవసరమైన పరికరాలు అంబులెన్స్‌లు అందించాలని వికారాబాద్ ప్రజలు కోరుతున్నారు.

వికారాబాద్, జూన్ 24 : బహరిన్ లో జరగబోయే నేషనల్ యూత్ గేమ్స్ కబడ్డీ టోర్నమెంట్‌కు వికారాబాద్ జిల్లా నుంచి గోపి సెలెక్ట్ అయినట్లు వికారాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరశురాం నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ ముదిరాజ్‌లు మంగళవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశం ముదిరాజ్‌కు, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో కబడ్డీ కోసం ఎల్లవేళలా కృషి చేస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఎంతోమంది క్రీడాకారులను ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

### అంత్యక్రియలకు ఆర్థిక సాయం

మర్పల్లి, జూన్ 24 : మర్పల్లి, జూన్ 24 : మండలంలోని పట్లూర్ గ్రామానికి చెందిన బుదారపు రవనీలా అనారోగ్యం తో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకుని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె అంత్యక్రియల నిమిత్తం రూ. ఐదు వేలు పంపగా స్థానిక మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్, నాయకులు రవి, రాచయ్య, శ్రీనివాస్‌తో కలిసి మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు

### కూతురుతో అసభ్యకరంగా ప్రవర్తన..

నిందితుడిపై పోక్సో కేసు

బొల్లారం, జూన్ 24: మద్యానికి బానిసై కూతురు (మైనర్) పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వ్యక్తిపై బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. సీఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. బొల్లారం కంటోన్మెంట్ క్వార్టర్స్‌లో నివాసముండే బాల నాగరాజు (40), లక్ష్మి దంపతులు. నాగరాజు వృత్తి రీత్యా పెయింటర్. గత కొన్ని రోజులుగా నాగరాజు అతిగా మద్యం సేవించి వచ్చి భార్య, కుమార్తెను అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ కొడుతున్నాడు. ఈనెల 22న అతిగా మద్యం సేవించి కుమార్తెను దుర్భాషలాడుతూ అసభ్యకరంగా తాకాడు. దీంతో భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

### ఆడుకుంటూ వెళ్లి బావిలో పడి..

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 24: ఓ బాలుడు ఆడుకుంటూ వెళ్లి నీటిబావిలో పడిపోయాడు. బావిలో గాలింపు చర్యలు చేపట్టినా బాలుడి ఆచూకీ లభించలేదు. ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన చంద్రకుమార్ .. భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, లక్ష్మీగూడ రాజీవ్‌గృహకల్పలో ఉంటున్నారు. వీరి కొడుకు ప్రిన్స్(5) మంగళవారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఆడుకుంటూ.. తోటి స్నేహితులతో కలిసి పక్కనే ఉన్న నీటి బావి వద్దకు వెళ్లి.. బావిలో పడిపోయాడు. స్నేహితులు ఆ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు బావి వద్దకు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్‌లు హైడ్రా, ఎన్‌డీఆర్ఎఫ్, అగ్ని మాపక సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రైనా బాలుడి ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు ప్రారంభిస్తామని పోలీసులు తెలిపారు.

### స్వచ్ఛభారత్‌తో పట్టణాల అభివృద్ధి

వికారాబాద్, జూన్ 24 : వికారాబాద్ పట్టణంలోని మా శారద హాస్పిటల్ ఎన్నెపల్లిలో వికారాబాద్ అసెంబ్లీ వికసిత్ సంకల్ప సభ కో కన్వీనర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ పేరుతో పట్టణాల నుండి గ్రామాల దాకా స్వచ్ఛతను తీర్చిదిద్దడం జరిగిందన్నారు.ఆయుష్మాన్ భారత్ ప్రవేశపెట్టి పేదవాడికి వైద్యం అందేలా శ్రీకారం చుట్టిందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు సదానం దరెడ్డి, బీజేపీ నాయకులు శివరాజ్ ఉన్నారు.

కులకచర్ల, జూన్ 24: సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని సేవాలాల్ సేన నాయకులు పేర్కొన్నారు. మంగళవారం సేవాలాల్ సేన మహాసభల గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలని, నామినేటెడ్ పదవులలో సముచిత స్థానం కల్పించాలని, హతిరాం మఠం ఆస్తులను కాపాడాలని, గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ల మాట నిలబెట్టు కోవాలని, బంజరాలకు సంబంధించిన సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండు చేస్తూ ఈ నెల 26న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన వికారాబాద్ జిల్లా అధ్యక్షులు శంకర్ నాయక్ , సేవాలాల్ సేన గౌరవ అధ్యక్షుడు రవి నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్, వికారాబాద్ జిల్లా ధర్మజాగరణ అధ్యక్షుడు కిషన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జూన్, 24: జిల్లాలో పారిశ్రామిక, పర్యాటక రంగాలను అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తన లక్ష్యమని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం మోమిన్ పేట్ మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రూ.70 లక్షల వ్యయంతో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బాల్ రెడ్డి గూడ వరకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన , రూ. 60 లక్షలతో బాల్‌రెడ్డి గూడాలో చేపట్టిన అంతర్గత రోడ్లకు ప్రారంభోత్సవం, రూ. 67 లక్షల వ్యయంతో పీడబ్ల్యూడీ నుంచి ఎన్కెపల్లి వరకు చేపట్టే బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన, మోమినిపేట్ మండల కేంద్రంలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన డీసీసీబీ భవనం ప్రారంభం, కేసారం లో రూ. 3.06 కోట్ల వ్యయంతో చేపట్టే 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ కు సభాపతి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కావలసిన నిధులను మంజూరు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ. 600 కోట్లు రోడ్ల కోసం మంజూరు అయ్యాయని, గల్లిగల్లీకి ప్రతి గ్రామంలో రూ. 60 లక్షల నుంచి రూ.కోటి తో సీసీ రోడ్లను వేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఊర్లకు వచ్చే తారు రోడ్లను కూడా అధిక నిధులను కేటాయిస్తూ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఉన్న భూములలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. అనంతగిరి కొండను వెయ్యి కోట్లతో పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి మెగా సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని, ఈ ప్రాజెక్టు ద్వారా రెండు నుంచి మూడు వేల మందికి ఉద్యోగాలు లభించడంతో పాటుగా స్థానికులకు ఉపాధి కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్మన్ కొత్తకుర్వ సత్తయ్య, జనరల్ మేనేజర్ ప్రభాకర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు కిషన్ నాయక్, అంజి రెడ్డి, మొగులయ్య, పీఏసీఎస్ చైర్మన్లు విష్ణువర్ధన్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, బ్యాంకు మేనేజర్ నారాయణ రెడ్డి, ఆర్టిఏ సభ్యులు జాఫర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి సదానందం, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేశ్ కుమార్, డీఈఈ మాధవరెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ రవీందర్ పాల్గొన్నారు.

వికారాబాద్, జూన్ 24 : బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ రాజేందర్‌గౌడ్ ను వికారాబాద్‌లోని ఆయన కార్యాలయంలో వికారాబాద్ నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు మంగళవారం కలిసి వారి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా కొన్ని రోజులుగా వారు చేస్తున్న ఉద్యమం గురించి వారికి జరుగుతున్న అన్యాయం గురించి రాజేందర్‌గౌడ్ కి వివరించారు. ఈ సందర్భంగా రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ కులవృత్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులదే అని స్పష్టంగా చెప్పారు. నాయి బ్రాహ్మణ సంఘం నాయకుల ఉద్యమానికి బీసీ సంఘం కూడా మద్దతుగా రావాలని చెప్పారు. దానికి తగిన కృషిని తన వంతుగా చేస్తానని తెలిపారు. వెంటనే స్పీకర్ ప్రభుత్వంలోని పెద్దలు అదేవిధంగా జిల్లా కలెక్టర్, కమిషనర్లు అందరు కూడా స్పందించి న్యాయం చేయాలని కోరారు.

# నాణ్యమైన నారు..దిగుబడి బాగు

ఇబ్రహీంపట్నం, జూన్ 24: వరిసాగులో అధిక దిగుబడి సాధించటానికి నారుమడి నిర్వహణ ఎంతో అవసరమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. విత్తనాల ఎంపిక, నారుమడి తయారీ, నిర్వహణలో సరైన జాగ్రత్తలు తీసుకుంటే, ఆరోగ్యకరమైన నారుని పెంచి, పొలంలో నాటిన తర్వాత మంచి దిగుబడి సాధించొచ్చు. అలాగే, సరైన విత్తనాలు ఎంపిక చేసుకుని యాజమాన్య పద్ధతులు అనుసరించాలి. వర్షాలు కురుస్తున్నందున రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నారుమడి యాజమాన్య పద్ధతులపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక సలహాలు, సూచనలు..

#### నాణ్యమైన విత్తన ఎంపిక..

వరిసాగులో విత్తనం ఎంతో కీలకం, మేలైన దిగుబడులు సాధించాలంటే నాణ్యమైన విత్తనాల ఎంపిక ముఖ్యం. రైతులు నీటి వనరులు ఆధారంగా, నేల స్వభావాన్ని బట్టి మంచి రకాలను ఎంపిక చేసుకోవాలి. ఆయా ప్రాంతాలకు అనుకూలమైన రకాలను సాగుచేయటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. దొడ్డు రకాలైన కేఎన్ఎం–118, జేజీఎల్–24423, బతుకమ్మ (జేజీఎల్ 18047), ఎంటీయూ –1010లాంటి రకాలను, సన్న రకాలల్లో కేఎన్ఎం 1638, తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్15048), డబ్ల్యూజీఎల్–44 వంటి రకాలను సాగుచేసుకోవాలి.

#### నారుమడి యాజమాన్యం..

వరిసాగులో నారుమడి తయారు చేసుకోవటం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవటం అవసరం. విత్తనశుద్ధి, చీడపీడల నివారణ జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్య నారు పెరుగుతోంది.

#### విత్తన మోతాదు..

దొడ్డురకం వరి విత్తనాలు ఎకరానికి 25కిలోలు, సన్నరం 20 కిలోల విత్తనం సరిపోతుంది. అభివృద్ధి చేసిన రకాలు, ఎకరానికి 15కిలోలు, అధిక దిగుబడినిచ్చే వంగడాలు ఎకరాకు 6కిలోలు సరిపోతుంది.

#### విత్తన శుద్ధి..

లీటరు నీటికి 1గ్రాము, కార్బండిజిమ్ కలిపిన ద్రావణంలో 24గంటల పాటు విత్తనాలను నానబెట్టి ఆ తర్వాత మండెకట్టి మొలకలను నారుమడిలో చల్లుకోవాలి. తక్కువ నిద్రావస్థ రెండు నుంచి మూడు వారాలున్న విత్తనాలకైతే లీటరు నీటికి 63మి.లీ ఎక్కువ నిద్రావస్త నాలుగు నుంచి ఐదు వారాలున్న విత్తనాలకైతే 100 మి.లీ గాడ నత్రికామ్లం కలిపి, ఆ ద్రావణంలో 24గంటల పాటు నానబెట్టి కడిగి మండె కట్టాలి.

వరినారు మడి..

#### నారు ఎంపిక..

నారుమడిని బాగా దున్ని 2–3 మార్లు దమ్ముచేసి చదును చేయాలి. కాల్వలు ఏర్పాటు చేయాలి. ఎత్తు నారుమడులను తయారు చేసుకోవటం మంచిది. రెండు గుంటల్లోని మడిలో విత్తనం చల్లేముందు దుక్కిలో కిలో నత్రజని చల్లాలి. మరో కిలో విత్తన 12–14రోజులకు చల్లాలి. అదేవిధంగా కిలో భాస్వరం, కిలో పొటాష్ ఇచ్చే ఎరువులు చల్లాలి. పశువుల పేడ లేదా ఇతర సేంద్రియ ఎరువులను దుక్కిలో వేసుకుంటే మంచి ఫలితాలువస్తాయి. మొలక కట్టిన విత్తనాన్ని చల్లి. వారం రోజుల్లో ఆరు తడులు ఇచ్చాక మొక్క దశలో పలుచగా నీరుంచాలి. జింకులోప నివారణకు లీటరు నీటికి రెండు గ్రాముల జింకు సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి.
మెట్ట నారుమడిలో ఇనుప ధాతు లోపాన్ని గమనిస్తే మొక్క వయస్సును బట్టి అన్నబేది 0.5 నుంచి 1గ్రామ నిమ్మ ఉప్ప లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
నారుతీసే ఏడు రోజుల ఉమంపద గుంట నారు మడి (2.3 సెంట్లకు) 400గ్రామ. కార్బోఫ్యూరాన్ 3జీ గులికలు ఇసుకలో కలిపి చల్లి పలుచగా నీరు ఉంచాలి. ఒకవేళ కాండం తొలుచు పురుగు ఉధృతిని గమనించనట్లయితే క్లోరాంథ్రానిలిప్రోల్ 5మి.లీ 16లీటర్ల సంపులో కలుపుకుని ఎకరానికి సరిపడా నారుమడిపై పిచికారీ చేసుకోవాలి. దీంతో పాటుగా వేప నూనెను కూడా పిచికారీ చేసుకోవటం వల్ల గుడ్డుదశలో ఉన్న పురుగులను నివారించవచ్చు. అలాగే, వేరుకుళ్లు వంటి తెగుళ్ల నివారణకు కార్బండిజం మాంకోజబ్ 30గ్రాముల మిశ్రమాన్ని 10 లీటర్ల నీటికి కలిపి ఎకరా నారుమడికి పిచికారీ చేసుకోవాలి. నాటు ఆలస్యమేతే రెండో దఫా నత్రజని ఆలస్యంగా వేసి నారు ముదరక ముందే నాటుకోవాలి.
నారుమడిలో కలుపు నివారణఖు బ్యూటాక్లోర్ లేదా ప్రెటిలాక్లోర్, సేపనర్ 25 మి.లీ ఎకరాకు సరిపడా నారుమడికి 5లీటర్ల నీటికి కలిపి లేదా బిస్‌పైరిబాక్ సోడియం కలుపు ముందను0జ5మి.లీ లీటరు నీటికి కలిపి నాటు వేశాక 8–10రోజులకు పిచిచారీ చేయాలి.
ఊద, ఒడిపిలి వంటి గడ్డిజాతి కలుపు ఉంటే నాటువేసిన 15–20రోజులకు సైహాలోపాప్–పీ బ్యూటైల్ మందును 1.5మి. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**యాజమాన్య పద్ధతులు తప్పనిసరి**

విత్తనాల ఎంపికతో పాటు ఎంచుకున్న విత్తనాలను మంచి మొలక శాతం వచ్చేలా చూసుకోవాలి. నారుమడిలో మురుగు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తీసే యాలి. దీని వల్ల నారు ఆరోగ్యకరంగా పెరిగి పైరు దశలో కూడా మంచిగా ఎదుగుతుంది. నారు మంచిగా ఉంటేనే దిగుబడి మంచిగా వస్తుంది. రైతులు నారుమడి యాజ మాన్యంపై నిర్లక్ష్యం చేయకుండా వ్యవసాయాధికారుల సూచనల మేరకు నడుచుకోవాలి.
– సుజాత, వ్యవసాయశాఖ ఏడీఏ, ఇబ్రహీంపట్నం

సుల్తాన్ ఉల్ ఉలూమ్ కాలేజీలో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో మాట్లాడుతున్న డీసీపీ వైవీఎస్ సుధీంద్ర

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి..

సిటీబ్యూరో, జూన్ 24(నమస్తే తెలంగాణ): బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ కళాశాలలో మంగళవారం హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (హెచ్‌న్యూ)ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి హాజరైన టాస్క్‌ఫోర్స్, హెచ్‌న్యూ విభాగం డిప్యూటీ కమిషనర్ వైవీఎస్ సుధీంద్ర మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రధానంగా డ్రగ్ రహితంగా జీవనాన్ని అలవర్చుకోవాలని, దీంతో భవిష్యత్ అద్భుతంగా ఉంటుందని, విద్యార్థులు డ్రగ్స్ పట్ల ఆకర్షితులయ్యే అవకాశమున్నందున జాగ్రత్తగా ఉంటూ అలాంటి వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.అనుపమ, హెచ్‌న్యూ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962